# విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**-తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి విద్యార్థులు ఎదగాలి**

**-విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే**

**-ఏసిటీవో ప్రసన్న కుమార్ రెడ్డిని స్ఫూర్తిగా.. ప్రేరణగా తీసుకోవాలి**

**-జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**





పెద్దమందడి నేటి ఫోకస్ న్యూస్:

విద్యార్థులు బాల్యం నుండే క్రమశిక్షణతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠ్య పుస్తకాలలో ఉన్న విజ్ఞాన భాండాగారాన్ని పిల్లలు ఆకర్షించే విధంగా తరగతి గదుల్లో కార్టూన్లు, సైంటిస్టుల చిత్రాలతో వేసిన పెయింటింగ్ గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ఏసిటిఓ) ప్రసన్న కుమార్ రెడ్డి సారథ్యంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు ఎంఈఓ మంజులత, స్థానిక ప్రధానోపాధ్యాయులు బండి శ్రీనివాసులు, జడ్పీ హైస్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఎస్సై శివకుమార్లతో కలిసి షూస్ (బూట్లు) అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దమందడికి చెందిన ప్రసన్న కుమార్ రెడ్డి బాగా కష్టపడి కానిస్టేబుల్ నుంచి రెవెన్యూ, ఎస్సై వంటి ఎన్నో ఉద్యోగాలు సాధించి గ్రూప్ 2 అధికారిగా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ విధుల్లో చేరి పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. ప్రసన్న కుమార్ రెడ్డి స్ఫూర్తి, ప్రేరణగా ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు నిరంతరం నిఘా పెడుతూ క్రమశిక్షణతో పెంచాలని కోరారు. అంతకుముందు ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల కోసం ఇక్కడే చదివి దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఫోన్ నంబర్లు సేకరించి 70 మందితో గ్రూపు క్రియేట్ చేసి 16 వేల బడ్జెట్ తో ప్రారంభించామని ఆయన తెలిపారు. అలాగే గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు విద్యార్థులకు పుస్తకాలు కూడా అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. కష్టపడి బాగా చదివితేనే జీవితంలో పైకి వస్తామన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జీకే శ్రీనివాస్, రోజా రాణి, కిరణ్ కుమార్, సుచిత్ర, ఈశ్వర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య ఎస్వీ రామారావు సేవలు చిరస్మరణీయం

**-మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:



ఆచార్య ఎస్వీ రామారావు చేసిన తెలుగు సాహిత్య సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలానికి చెందిన ఎస్వీ రామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా, తెలుగు శాఖ అధిపతి, డీన్ గా ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్బీనగర్ చిత్రలే అవుట్ లోని బాలాజీ రెసిడెన్సి కి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. రామారావు తెలుగు సాహిత్యానికి ఎన్నో సేవలు అందించి ఆచార్యునిగా, పరిశోధకుడిగా కొనసాగుతూ మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# కేటీఆర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**-ఎస్పీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కు ఫిర్యాదు చేశారు. గ్రూప్ -1 అభ్యర్థులపై నిందలు మోపి వారి జీవితాల్లో చిచ్చురేపిన కేటీఆర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన మేరకు సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలోని 570 మంది అభ్యర్థులు సంబంధిత అధికారులకు మూడు నుంచి ఐదు కోట్ల రూపాయలకు పోస్టులు కొనుక్కున్నారని నిరాధార ఆరోపణలు చేసి ర్యాంకులు సాధించిన అభ్యర్థుల జీవితాల్లో చిచ్చుపెట్టిన కేటీఆర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ ఎల్ ఎన్ రమేష్, శంకర్ ప్రసాద్, బ్రహ్మం చారి, ఆదిత్య, శరవంద, ఎల్ఐసి కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు సెప్టెంబర్ 19

హిందీ భాషను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నేర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాటోతు రమేష్ నాయక్ అన్నారు.

మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిటెండెంట్ బానోతు దేవీలాల్ ఆదేశాల మేరకు హిందీ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు.

దానిలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మేరా యువభారత్ జిల్లా యువ సమన్వయకర్త బానోతు వీరన్న నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమేష్ నాయక్ మాట్లాడారు. జాతీయ ఉద్యమంలో దేశాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహద పడిందని తెలిపారు. కేంద్ర అధికార హోదా అందుకున్న భాష హిందీ అని, దేశంలో అత్యధికలు మాట్లాడే భాష ఇదేనని తెలిపారు. భాషాపరంగా ఎంతో వైవిధ్యం ఉన్న దేశ ప్రజలను ఒకటి చేసేది హిందీ భాషేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భూక్య శ్రీనివాస్ నాయక్, మచ్చసాగర్, ప్రతినిధులు రాజు నాయక్, సురేష్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించేలా ఏర్పాట్లు



**మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్**

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు సెప్టెంబర్ 19

పట్టణ ప్రజలు ఘనంగా బతుకమ్మ పండుగను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ అన్నారు. ఈనెల 21న (ఆదివారం) బతుకమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. బతుకమ్మ ఆడే చెరువు పరిసరాలతో పాటు నిమజ్జన ప్రాంతాలవద్ద లైటింగ్, పారిశుధ్య పనులు, తాగునీటి వసతి , మైదానాలను చదును చేయడం వంటి పనులు కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.... తరతరాల తెలంగాణ జనజీవన సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండగని, తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ చిహ్నం బతుకమ్మ అని తెలిపారు. మహిళలు అత్యంత ఉత్సాహంతో ఆటపాటలతో జరుపుకునే పండుగ బతుకమ్మ తొర్రూరు పట్టణంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలు ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు. ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్, శానిటరీ ఇన్స్పెక్టర్ కొమ్ము దేవేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమరాజ శేఖర్,వార్డు ఆఫీసర్ జలగం మీనేష్, స్థానికులు బెల్లంకొండ దేవేందర్, జె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై పట్టింపెవరికి..

### ఆర్డీనరీ బస్సులు ఆగక ప్రజలకు ఇబ్బందులు
### బస్టాప్ దాటేస్తున్న బస్సులతో గ్రామస్తుల కష్టాలు

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 19



ప్రజా రవాణా అందరికీ అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ వాగ్దానాలు కొరిపల్లి గ్రామ ప్రజలకు మాత్రం కలగానే మిగిలాయి. రిక్వెస్ట్ బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆగకపోవడంతో గ్రామస్తులు నిత్యం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉచిత ప్రయాణ పథకం ఉన్నా బస్సులు ఆగకపోవడం వల్ల ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు వేల జనాభా, 1258 ఓట్లు ఉన్న గ్రామం..**

పెద్దవంగర మండలంలోని కొరిపల్లి గ్రామం సుమారు రెండు వేల జనాభా, 1258 ఓట్లతో ఉన్న పెద్ద పల్లె. ఇక్కడి ప్రజలు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కోసం తరచూ తొర్రూరు, వరంగల్, ఖమ్మం, తిరుమలగిరి, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటారు. గతంలో ఎక్స్ప్రెస్, ఆర్డీనరి బస్సులు బస్టాప్ వద్ద ఆగేవి. కానీ 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత బస్సులు ఆగడం మానేశాయని గ్రామస్తులు చెబుతున్నారు.

**కిలోమీటర్ పైగా నడిచి ప్రయాణం..**

ఈ సమస్య వల్ల విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వృద్ధులు ప్రతిరోజూ కిలోమీటర్ పైగా నడిచి క్రాస్ రోడ్డు వరకు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం నడిచి వచ్చిన తరువాత కూడా బస్సులు ఆగకపోవడం మరింత ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా పాఠశాలలు, కాలేజీలు వెళ్ళే విద్యార్థులు, బలహీనులు, చిన్నారులు, రోగులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా తమ పంటలు అమ్ముకునేందుకు పట్టణాలకు వెళ్ళడంలో ఇబ్బందులు పడుతున్నారు.

**ఉచిత పథకం ప్రయోజనం ఎక్కడ?**

"ఉచిత ప్రయాణ పథకం ఉన్నా బస్సులు ఆగకపోతే మాకు ఉపయోగం ఏమిటి?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజా రవాణా వ్యవస్థ మీద విశ్వాసం దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు

గ్రామ పెద్దలు, మహిళలు, యువత కలిసి తొర్రూరు డిపో మేనేజర్ వెంటనే స్పందించి, కొరిపల్లి బస్టాప్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య చిన్నదిగా కనిపించినా, ఇది గ్రామ ప్రజల దైనందిన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని వారు హెచ్చరిస్తున్నారు.

**గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షణ**

కొరిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆర్డీనరీ బస్సులు ఆగక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఇరవై నెలలుగా పరిస్థితి మారకపోవడంతో ప్రజలు గంటల తరబడి బస్టాప్ వద్ద వేచి చూడాల్సి



వస్తోంది. చివరికి ప్రయాణం కోసం ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి, గ్రామ క్రాస్ రోడ్డు వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజానికి ఔషధ మొక్కలు కీలకం

### - స్వచ్ఛమైన జీవనం కోసం ఔషధ మొక్కల ప్రాధాన్యత
### - ప్రజల మేలు కోసం ఔషధ మొక్కల పెంపకం అవసరం
### - ఎంపీడీవో వేణుమాధవ్

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 19

ఔషధ మొక్కలు మానవ మనుగడకు, ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తాయని ఎంపీడీవో వేణుమాధవ్ తెలిపారు. కాలుష్యం పెరుగుతున్న తరుణంలో ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఔషధ మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఆయన సూచించారు. ఔషధ మొక్కలను పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి, పర్యావరణ సమతుల్యతతో పాటు ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనం కలుగుతుందని ఎంపీడీవో అన్నారు.



ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి దంపతులు 100 ఔషధ మొక్కలను అందజేయగా, వాటిని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాటి ఔషధ మొక్కల ఉద్యాన వనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీజీఆర్ ప్రతినిధి అన్నమయ్య మాట్లాడుతూ.. ఔషధ మొక్కలతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఔషధ మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి జీవితానికి ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

తరువాత మొక్కల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసి, పర్యావరణ పరిరక్షణలో వారి పాత్రను వివరించారు.

కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేష్, సీజీఆర్ కోఆర్డినేటర్ జీవన్, ఎర్త్ క్లబ్ ఇంచార్జ్ శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నాచారం సీఐ బాధ్యతలు స్వీకరించిన ధనుంజయ

నాచారం,నేటి ఫోకస్ న్యూస్:

నాచారం పోలీస్ స్టేషన్‌లో కొత్త సీఐగా ధనుంజయ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువనేత బొల్లు నరసింహ గౌరవంగా శాలువాతో సత్కరించారు. పోలీసు అధికారులు సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తారని, ధనుంజయ నాయకత్వంలో ప్రజలకు మరింత సమీపంగా సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ మైబెల్లి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్డెమ్మ పండుగ సంబరాలు

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 19



తొర్రూరు పట్టణంలోని బీరప్ప నగర్ కాలనీలో బొడ్డెమ్మ వేడుకలు మహిళలు పిల్లలు అందరూ కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారూ. మహిళలు ఎప్పుడు అని ఎదురు చూసే ఈ బొడ్డెమ్మ పండుగ బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజుల ముందు వస్తుంది.. బొడ్డెమ్మ పండుగను కన్నెపిల్లలు మహిళలు సాయంత్రం సమయంలో పుట్టమట్టిని తీసుకొచ్చి 9 దొంతరలు, లేదా ఐదు లేదా మూడు అమ్మవారి ప్రతిరూపంగా (గద్దెలు) భావించి, పేర్చి తయారుచేసి ఎర్ర మట్టితో అలికి పసుపు కుంకుమ పూలతో అలంకరించి గౌరీ దేవి రూపంలో అమ్మవారికి తొమ్మిది రోజులు పాటు ఆటపాటలతో భక్తిశ్రద్ధలతో కోలాటాలతో నిర్వహిస్తారు. ఇది మహిళలు తమ సంస్కృతి సాంప్రదాయాలను గుర్తుంచుకోవడానికి, ఆనందించుకోవడానికి, ఒక వేదికగా అందిస్తుంది.